అతివేగం, మద్యపానమే ప్రమాదాలకు కారణం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

సుబేదారి, జనవరి 19 : అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు రవాణా విభాగం, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్స్‌కు తరలించి మెరుగైన చికిత్స అందిలా చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీటీసీ పురుషోత్తం, ఆర్డీవో రంగారావు, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్‌కుమార్, ట్రాఫిక్ సీఐలు వెంకన్న, సీతారెడ్డి, సుజాత, ఎంవీఐలు రమేశ్‌రాథోడ్, రవీందర్, స్వర్ణలత, షాలిని, ఫహీమా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలి : డీఎఫ్‌వో

ములుగురూరల్, జనవరి 19 : వన్యప్రాణులను వేటాడే వారిపై చర్యలు తీసుకోవాలని ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో ములుగు, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఫారెస్టు సిబ్బందికి 'వన్యప్రాణుల రక్షణ, వేటాడితే చేపట్టాల్సిన చర్యలు'పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వైల్డ్ లైఫ్ కన్జర్వేటర్ ట్రస్ట్(డబ్ల్యూటీ) ముంబై వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు డీఎఫ్‌వో పాల్గొని మాట్లాడారు. అనంతరం డబ్ల్యూసీటీ సీనియర్ ట్రైనర్స్ సంయుక్త, సంజయ్ ఠాకూర్ ఫారెస్టు సిబ్బందికి అడవుల రక్షణ, వన్యప్రాణులను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ములుగు ఎఫ్ఆర్వో శంకర్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను అణగదొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర

- అభివృద్ధిని అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నాలు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- జీపీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న హస్తం నాయకులు
- అధికారుల మాటను గౌరవించి వెనుతిరిగిన ఎమ్మెల్యే


ఏసీపీ డేవిడ్‌రాజ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, జనవరి 19 : బీఆర్ఎస్ నాయకులను అణగదొక్కేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవన ప్రారంభించేందుకు ఆయన వెళ్లగా, కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి లేకుండా ఎమ్మెల్యే ఎలా ప్రారంభిస్తారని ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ పోలీస్ సిబ్బందితో గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభించకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో ఏసీపీ డేవిడ్‌రాజ్, తహసీల్దార్ మాధవి మాట్లాడారు. కాగా, బీఆర్ఎస్ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఇరు వర్గాలను సముదాయించి మంత్రి సమయం తీసుకున్నాకే ప్రారంభించాలని ఎమ్మెల్యేకు సూచించారు. కాగా, కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలని మంత్రి, కలెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని కౌశిక్ రెడ్డి చెప్పారు. ఈ నెల 31న సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్నదని, 24 వరకు అధికారులు ప్రొటోకాల్ ప్రకారం మంత్రికి సమాచారం ఇవ్వాలని, లేకుంటే తామే ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్..

నియోజకవర్గంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కావడంతో అభివృద్ధిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని ఎమ్మెల్యే విమర్శించారు. నూతన పంచాయతీ భవనాల ప్రారంభానికి కాంగ్రెస్ మంత్రులు, నాయకులు వస్తే తనకేలాంటి అభ్యంతరం లేదన్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు కావాలనే కల్యాణలక్ష్మీ చెక్కులను జమ్మికుంట తహసీల్దార్ ద్వారా లబ్ధిదారులకు ఇప్పించారని, తహసీల్దార్ రూ.10వేలు లంచం తీసుకుని వాటిని పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి నెల రోజులైనా పట్టించుకోవడం లేదన్నారు. ఆ డబ్బులో మంత్రులకు ఏమైనా వాటా ఉందో? చర్యలు తీసుకోకుండా కలెక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నారో? తెలియడం లేదన్నారు. కమలాపూర్ మండలంలోని డీబీఎం 24 కాల్వకు నీళ్లు ఇవ్వడం లేదని, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాగు నీళ్లు ఇవ్వాలని లేదంటే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రైతుబంధు డబ్బులను వెంటనే ఖాతాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు, జడ్పీటీసీ లాండిగ కల్యాణి, ఎంపీటీసీ భాస్కర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు తిరుపతిరావు, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తు ఫారం నింపుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి 19 : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2021 అక్టోబర్ 31తేదీలోపు డిగ్రీ పూర్తయిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు ఉన్నాయని తెలిపారు. కార్యాలయంలో 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫామ్స్ నింపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ ఎలకంటి రాములు, నాయకులు పులి రజినీకాంత్, నయీమొద్దీన్, జానకీరాములు, సదాంత్, సదానందం, శ్రీధర్, శ్రీకాంత్, పరశురాములు, వేణు, భీమ్‌రాజ్, వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్ చౌరస్తా, జనవరి 19 : హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమంచ శ్యాంసుందర్ మృతి చెందగా, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శుక్రవారం నివాళులర్పించారు. ఉర్సు బొడ్రాయి ప్రాంతంలో ఎల్జీ కల్స్ షాపు నిర్వహించే అతడు మృతిచెందినట్లు తెలుసుకొని శుక్రవారం ఉదయం ఎంజీఎం మార్చురీ వద్దకు చేరుకొని నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

విశ్వసనీయ సంస్థ బాలవికాస : నాయిని

బాల థెరిసాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

న్యూశాయంపేట, జనవరి 19 : బాలవికాస సంస్థపై గ్రామీణ ప్రజలకు విశ్వాసం ఎక్కువని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫాతిమానగర్‌లోని బాలవికాస పీడీటీసీ(శిక్షణా కేంద్రం)లో 'సమర్థ నాయకత్వం.. మహిళల సుస్థిరాభివృద్ధి' అంశంపై రాష్ట్రస్థాయి మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస ఆధ్వర్యంలో వితంతు వివక్షతకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం గొప్పదన్నారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాల థెరిసా జింగ్రాస్, ఈడీ శౌరిరెడ్డి, సోపాల్ కెనడా డైరెక్టర్ శోభ మాట్లాడారు. కాగా, జబర్దస్త్ కమేడియన్లు శాంతికుమార్, రాజమౌళి స్కిట్లు ఆకట్టుకున్నాయి. సదస్సులో బాసాని మల్రెడ్డి, దీపా-సురేందర్ రెడ్డి, లూర్థు మల్రెడ్డి, కూసం రాజమౌళి, సురేశ్‌రెడ్డి, సునీతారెడ్డి, లత, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా : కేయూ ఉద్యోగి మధుసూదన్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి 25 లోపు డబ్బులు చెల్లించాలని వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.16 కోట్ల న్యాక్ బడ్జెట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలని, భావన డిజిటల్ ఓనర్ మధుసూదన్ మృతికి కేయూ వీసీ, రిజిస్ట్రారే కారణమని ఆరోపించారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నెక్కొండ, జనవరి 19 : గొట్లకొండ శివారు మాలోత్ బిక్యాతండాలో నిర్మిస్తున్న సంతు శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ పాల్గొని సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను తండావాసులకు వివరించారు. ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, సర్పంచ్ సరోజా వెంకట్‌నాయక్, గొట్లకొండ సర్పంచ్ తులసి వెంకన్న, ఎంపీటీసీ కునుసోత్ సరోజ శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ మాలోత్ వెంకన్న నాయక్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారి ఆస్తుల వేలం

ఎల్కతుర్తి, జనవరి 19 : ఎల్కతుర్తి విశాల సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన వారి ఆస్తులను ఈ నెల 30న వేలం వేయనున్నట్లు కేడీసీసీ బ్యాంకు సేల్స్ ఆఫీసర్ రాజు తెలిపారు. ఎల్కతుర్తి సొసైటీ మాజీ అధ్యక్షుడు, సీఈవోలు రూ.1,53,11,350 అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయని, దీనిపై కోఆపరేటివ్ ట్రిబ్యునల్ వరంగల్ కోర్టులో కేసు వేయగా, 2023 నవంబర్ 3న కోర్టు విచారణ చేపట్టిందన్నారు. ఆరోపణలు రుజువు కావడంతో సంఘానికి డబ్బులు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే, నిందితులు డబ్బులు చెల్లించకపోవడంతో శుక్రవారం సేల్స్ ఆఫీసర్ నోటీసులు అందజేశారు. ఈ నెల 30న ఎల్కతుర్తి పంచాయతీ ఆవరణలో వారి ఆస్తులను వేలం వేయనున్నట్లు రాజు చెప్పారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు శ్రీపతి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మునిగడప శేషగిరి, పాలకవర్గ సభ్యులు లోకిని సూరయ్య, నాగిళ్ల కృష్ణమూర్తి, ముప్పు మహేందర్, మంతుర్తి సమ్మయ్య, సీఈవో జనగాని తిరుపతి ఉన్నారు.

ఎస్వీఎస్‌లో స్ప్రింగ్ ఫైర్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి, జనవరి 19 : భీమారంలోని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి ఫిబ్రవరి 10, 11తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్ ఫైర్ వేడుకల పోస్టర్‌ను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లండన్ లెజిస్లేటివ్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్వీఎస్ గ్రూప్ సంయుక్తంగా అంతర్జాతీయ కాంపిటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏండ్ల విభాగంలో పాలిటెక్నిక్ విద్యార్థులు, పదో తరగతి విద్యార్థుల కోసం మోడల్ పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు ఫ్రీ రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఆన్‌లైన్ ఎంసెట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, వేడుకలకు విద్యార్థులు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వీరికి డాన్స్, సింగింగ్, పోస్టర్ ప్రెజంటేషన్, వివిధ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. కాంపిటేషన్‌లో దేశ విదేశాల నుంచి అధ్యాపకులు హాజరై పరిశోధనపత్రాలు అందించనున్నారని తెలిపారు.

ఎస్సార్ యూనివర్సిటీలో సదస్సు

హసన్‌పర్తి, జనవరి 19: ఎస్సార్ యూనివర్సిటీలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా - స్టూడెంట్ బ్రాంచ్‌ను శుక్రవారం డీన్, ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రజిత్ గుప్తాతో కలిసి ప్రొఫెసర్ డాక్టర్ ఎం శశికళ ప్రారంభించారు. సీఎస్ఐ అధిపతి చంద్ర ఎస్ దాసాక ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రొఫెసర్ ఇంద్రజిత్ గుప్తా, కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ నీలిమా, విద్యార్థుల కమిటీ సభ్యులు జే ఉదయ్, సలీం ఎస్‌కే, బీ హరికృష్ణ, అభిసాత్విక, ఎన్ మేఘన, డీ వర్షిత పాల్గొన్నారు.

పారిశుధ్య విధానాలపై జపాన్ ప్రతినిధుల అధ్యయనం

జపాన్ బృందంతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, జనవరి 19 : కార్పొరేషన్ పరిధిలో అమలు చేస్తున్న పారిశుధ్య విధానాలను అధ్యయనం చేసేందుకు జపాన్ శానిటేషన్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు వరంగల్‌ను సందర్శించారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) అందజేసిన అసైన్‌మెంట్‌పై శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణితో సమావేశమయ్యారు. అనంతరం అమ్మవారిపేటలోని మల శుద్ధి నిర్వహణ (ఎఫ్ఎస్‌టీపీ) కేంద్రం, ఎంజీఎంలో ఏర్పాటు చేసిన మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని (ఎస్‌టీపీ) వారు సందర్శించారు. 150 ఎంఎల్‌డీ ఎస్ఎఫ్‌టీపీ నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఆరోగ్యం విషయంలో బల్దియా చేపడుతున్న రక్షణ చర్యలు, 14420 టోల్ ఫ్రీ నంబర్‌పై నగర వాసులకు చైతన్యం కల్పిస్తున్న విషయాలను మేయర్ వారికి వివరించారు. జీడబ్ల్యూఎంసీ అనుసరిస్తున్న విధానాలు ప్రపంచానికి లెర్నింగ్ ప్లాట్ ఫామ్‌లా ఉందని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కోఆపరేషన్ అండ్ ప్రాజెక్టు డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కత్సుయోషి సుడో, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ మేనేజర్ ఫైర్రె ఫ్లెమండ్, అస్కి ప్రతినిధి డాక్టర్ రాజ్ మోహన్‌రెడ్డి, సభ్యుడు అవినాశ్ పాల్గొన్నారు.

వంద శాతం పన్నుల వసూలే లక్ష్యం..

పన్నుల సేకరణను వంద శాతం సాధించాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్ల పురోగతిపై కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ ఏడాడి రూ.100.92 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కేవలం రూ. 44.50 కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. సమావేశంలో సీపీ వెంకన్న, డీసీ రవీందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హరిత ప్రాంగణంగా హనుమకొండ కలెక్టరేట్

కలెక్టర్ సిక్తా పట్నాయక్

మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, జనవరి 19 : వివిధ రకాల మొక్కలతో హరిత ప్రాంగణంగా హనుమకొండ కలెక్టరేట్ రూపుదిద్దుకుంటున్నదని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ చుట్టూ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పూల మొక్కలు నాటారు. కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో పదివేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది సంరక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్వో వైవీ గణేశ్, డీఆర్డీవో శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు. అలాగే, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గణతంత్ర దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఉత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించాలన్నారు. డీపీవో జగదీశ్వర్, డీఎంహెచ్‌వో సాంబశివరావు పాల్గొన్నారు. కాగా, ఎయిడ్స్ నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారం అందించి హెచ్ఐవీ నియంత్రణలో జిల్లాను ముందు వరుసలో నిలుపాలని సూచించారు. ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి క్విజ్ కాంపిటేషన్‌లో ద్వితీయ బహుమతి సాధించిన గండి సహస్ర, నలిమెల అక్షయను సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన నర్సింగ్ స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్, డీడీ బీసీ శ్రీరామ్‌రెడ్డి, డీడబ్ల్యూవో మధురిమ, డీసీఎస్‌వో వసంతలక్ష్మి, నెహ్రూ యువ కేంద్ర యూత్ కోఆర్డినేటర్ అన్వేశ్, స్పోర్ట్స్ అధికారి అశోక్, డెమో అశోక్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతరకు ఏర్పాట్లు చేపట్టండి

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, జనవరి 19 : అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. అమ్మవారిపేటలో కొనసాగుతున్న 150 ఎంఎల్‌డీ, ఎఫ్ఎస్‌టీ పనులను పరిశీలించి, యంత్రాల బిగింపు త్వరగా చేపట్టాలన్నారు. అనంతరం బాలసముద్రం, రాంనగర్, కిషన్‌పుర, అలంకార్ జంక్షన్, యాదవనగర్, రెడ్డికాలనీ, విద్యానగర్, వికాస్‌నగర్, భవానీనగర్, వడ్డేపల్లి, ఎక్సైజ్ కాలనీ, టీచర్స్ కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు, ప్రహరీలను పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, డీఈ సంతోష్‌బాబు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గిర్మాజీపేట, జనవరి 19 : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఖుష్‌మహల్‌లో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అంతకుముందు జిల్లా అధికారులతో పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, ఆర్డీవోలు వాసుచంద్ర, కృష్ణవేణి, జిల్లా పరిషత్ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో సంపత్‌రావు, డీపీవో కల్పన, డీఈవో డీ వాసంతి, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎలక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ పాల్గొన్నారు.

బియ్యం రవాణాలో అంతరాయం ఉండొద్దు

జిల్లాలోని రేషన్‌షాపులు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ సెంటర్లకు బియ్యం రవాణా చేసే కాంట్రాక్టర్లు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లో బియ్యం రవాణాకు సంబంధించిన టెండర్లను కాంట్రాక్టర్ల సమక్షంలో డ్రా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి టెండర్లు వరంగల్ నుంచి ముగ్గురు, నర్సంపేట, వర్ధన్నపేట నుంచి ఒక్కరి చొప్పున టెండర్లు కోట్ చేయగా అతి తక్కువ ధర పలికిన కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. సివిల్‌సప్లై జిల్లా మేనేజర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే సదస్సు

కమలాపూర్, జనవరి 19 : విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే సదస్సు నిర్వహించినట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ తిరుమల్‌రావు అన్నారు. శుక్రవారం కమలాపూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో వినియోగదారుల సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌లు, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కాగా, సమస్యలను అధికారులు పరిష్కరించకుంటే విద్యుత్ భవన్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. చరణ్‌దాస్, నరేందర్, ఏఈలు రాములు, సంపత్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

నర్సంపేట, జనవరి 19: జల్సాల కోసం తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీసీపీ రవీందర్ వివరాలను వెల్లడించారు. ఖానాపురానికి చెందిన మదిపెద్ది వినయ్, గొటుకుల నవీన్, నర్సంపేటకు చెందిన బాదం సాయికుమార్ మద్యం తాగుతూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. మిత్రుడు దినేశ్ కుటుంబం వేములవాడకు వెళ్లగా ఈ నెల 15న రాత్రి వారి ఇంట్లో బంగారం, వెండి వస్తువులను దొంగిలించారు. అలాగే, ఈ నెల 17న రాత్రి నర్సంపేటలోని టీచర్స్ కాలనీలో నాగేందర్ ఇంట్లో బీరువా పగులగొట్టి రూ.3లక్షలు దోచుకున్నారు. పక్కనున్న మరో ఇంట్లోకి ప్రవేశించి వెండి వస్తువులు, పూజా వస్తువులను చోరీ చేశారు. దొంగిలించిన వస్తువులను వరంగల్‌లో విక్రయించేందుకు శుక్రవారం వెళ్తూ ఖానాపురం శివారులో పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.5లక్షల విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, టీచర్స్ కాలనీలో చోరీ కేసులో వాస్తవంగా రూ.3లక్షలే పోయినట్లు నిర్ధారించారు. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఏసీపీ తిరుమల్, సీఐలు రవికుమార్, కిషన్, ఎస్సైలు రవికుమార్, రాజు, మాధవ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాజీపేటలో రెండిళ్లల్లో చోరీ

కాజీపేట, జనవరి 19 : తాళం వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు రూ.3లక్షల నగదు, బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం కాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో బిల్డర్ శ్రీనివాసరావు, రైల్వే ఉద్యోగి బబ్లూకుమార్ భార్యా పిల్లలతో అద్దెకు ఉంటున్నారు. శ్రీనివాస్‌రావు ఇటీవల కుటుంబం సహా ఒంగోలుకు వెళ్లాడు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాలు, రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే